క్లుప్తంగా

ఉపాధ్యాయుడు మౌలాలికి ప్రశంస పత్రం



తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మౌలాలి భారత ప్రభుత్వం, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నుంచి ప్రశంస పత్రం అందుకున్నారు. ఆగస్టు 2 నుంచి 15 వరకు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు భారత ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ ఆఫ్ హానర్ అధికారిక ధ్రువీకరణ పత్రాన్ని పోర్టల్ ద్వారా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈఓ సుజాతతోపాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నేటితో బార్ లైసెన్స్ గడువు పూర్తి

మార్కాపురం టౌన్: బార్ లైసెన్సుల దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగుస్తుందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. మార్కాపురంలో జనరల్ కోటాలో 5 బార్లు, గీత కులాల కోటాలో 2 బార్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. 30వ తేదీ ఉదయం 8 గంటలకు ఒంగోలులో కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానంలో లైసెన్స్ దారులను ఎంపిక చేస్తారని వివరించారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

పొదిలి రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పొదిలి మండలంలో తలమళ్ల వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తలమళ్ల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గాలిముట్టు రమేష్, సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సృజన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ప్రధాన రహదారి మలుపు వద్ద కుడివైపునకు రోడ్డు క్రాస్ చేస్తుండగా వెనుక నుంచి మోటరు సైకిల్‌పై వస్తున్న యువకుడు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ముగ్గురూ రోడ్డుపై పడిపోయారు. టీచర్ రమేష్‌తోపాటు, వరికుంటపాడు గ్రామానికి చెందిన రాచపూడి నాగేంద్రబాబుకు తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలులోని ఓ ఆస్పత్రికి తరలించారు. రమేష్ భార్య సృజనకు స్థానిక వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు.

కోతులు, కుక్కల బెడద నుంచి కాపాడండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం 3వ వార్డు ప్రజలు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. డ్రైవర్స్ కాలనీ, ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో కోతులు, కుక్కలు ఎక్కువై ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రాలేకపోతున్నారని, పిల్లలు స్కూళ్లకు వెళ్లాలంటే భయపడుతున్నారని తెలిపారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులు రూబెన్, జాన్‌బీ, రఫీ, రసూల్‌బీ పాల్గొన్నారు.

పశ్చిమాన భారీ వర్షం



మార్కాపురంలో కురుస్తున్న వర్షం



గిద్దలూరులో రోడ్డుపై పడిన చెట్టుకొమ్మ

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గుండ్లకమ్మకు వరద నీరు చేరుతోంది. గురువారం సాయంత్రానికి మార్కాపురంలో 25 మి.మీ, పెద్దారవీడు 36.8, దోర్నాల 74.2, యర్రగొండపాలెం 13.2, త్రిపురాంతకం 17.8, పుల్లలచెరువు 1.4, కంభం 26.6, బేస్తవారపేట 22.4, అర్ధవీడు 25.2, గిద్దలూరు 1.0, రాచర్ల 8.4, తర్లుపాడు 13.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పత్తి, సజ్జ, కంది పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు భావిస్తున్నారు.

గిద్దలూరు రూరల్: బలమైన ఈదురుగాలులు, వర్షానికి స్థానిక మాయాబజార్ వీధిలో పశువైద్యశాల ఆవరణలో ఉన్న భారీ చెట్టు కొమ్మ విరిగిపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. వాహనాల రాకపోకలకు కొన్ని గంటల పాటు అంతరాయం ఏర్పడింది.

విద్యుత్ చార్జీల పెంపుతో పేదలపై పెనుభారం

- బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరులకు వామపక్షాల నాయకుల నివాళి



ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు



పొదిలిలో ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్షాల నాయకులు

మార్కాపురం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసంబద్ధ విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా తలపెట్టిన పోరాటంలో అమరులైన కార్యకర్తలకు సీపీఐ, సీపీఎం పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. గురువారం పట్టణంలోని కోర్టు సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వామపక్షాల నాయకులు అందె నాసరయ్య, డీకేఎం రఫీ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ రాజధాని హైదరాబాద్‌లో చంద్రబాబు పాలనలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని చేపట్టిన ఉద్యమంలో రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి ప్రాణాలు పణంగా పెట్టారన్నారు. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు ఇష్టారీతిగా పెంచి పేదలపై భారం మోపిందని, చార్జీలు తగ్గించేంత వరకు పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అమరవీరుల ఆశయాలు కొనసాగిస్తామన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి 14 నెలల కాలంలో ప్రజలపై రూ.15,485 కోట్ల భారం మోపి మోసం చేశారని దుయ్యబట్టాఅన్నారు. ప్రస్తుతం మళ్లీ 12,717 కోట్ల రూపాయల భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని, ఈ చర్యను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని అదానీ, ఇతర కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. ట్రూఅప్, సర్ చార్జీల పేరుతో ప్రజల నుంచి చేస్తున్న వసూళ్లను ఆపాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్యుత్ పేరుతో స్మార్ట్‌మీటర్లను బిగించి ప్రజలపై మరో బాదుడుకు సిద్ధమవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్‌కే ఖాశిం, హరిబాబు, సీపీఎం నాయకులు రూబెన్, నన్నేసా పాల్గొన్నారు.

పొదిలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలనలో 2000వ సంవత్సరం ఆగస్టు 28వ తేదీన హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో పోలీసులు జరిపిన కాల్పుల్లో అశువులు బాసిన వామపక్షాల కార్యకర్తలకు స్థానిక కాలేజీ రోడ్డులో గురువారం రాత్రి కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. అమరుల పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు ఇష్టారీతిగా పెంచి ప్రజలను దోపిడీ చేస్తోందని ధ్వజమెత్తారు. గత 14 నెలల కాలంలో పెంచిన విద్యుత్‌చార్జీలు, ట్రూఅప్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ కమిటీ కన్వీనర్ పిల్లి బాలనరసయ్య, ఆరికట్ల శ్రీను, రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు ఎస్‌కే కరీముల్లా, రామారావు, ఎస్‌కే మస్తాన్‌వలి, ఎస్‌కే బాషు, యోగయ్య, నారాయణరెడ్డి, సీపీఐ నాయకులు పీవీ కొండయ్య, జి.ఏసురత్నం, జేవీవీ నాయకులు దేవ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మాజీ అధ్యక్షుడు ప్రభుదాసు, శ్రీను, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిమితి మేరకే పొగాకు సాగు చేయాలి



సలకనూతలలో రైతులకు పొగాకు సాగుపై సూచనలిస్తున్న అధికారులు

పొదిలి రూరల్: రైతులు పొగాకు బోర్డు నిర్ణయించిన పరిమితిలోనే పంట సాగు చేయాలని టుబాకో బోర్డు రీజినల్ సూపరింటెండెంట్ ఎం.సత్యశ్రీనివాస్ సూచించారు. గురువారం పొదిలి మండలంలోని సలకనూతల, మూగచింతల, మాదాలవారిపాలెం గ్రామాల్లో పొగాకు నారు మడుల పెంపకం, నియంత్రణ కార్యక్రమంపై రైతులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారుమడుల రిజిస్ట్రేషన్, పొగాకు నారు విక్రయాల గురించి తెలియజేశారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న నిల్వలను దృష్టిలో పెట్టుకుని 142 మిలియన్ కేజీల ఉత్పత్తిని అనుమతించినట్లు తెలిపారు. గరిష్టంగా ప్రతి రైతు రెండు హెక్టార్ల విస్తీర్ణం వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు మోతీలాల్, పొదిలి వేలం నిర్వాహణాధికారి జి.గిరిరాజ్‌కుమార్, ఎండీ సమయద్దీన్, వి.జీవన్, ఎస్‌కే ఆశాబీ, రైతులు పాల్గొన్నారు.

గోమాతలకు బెల్లం, నవధాన్యాలు



గోమాతలకు నవధాన్యాలు పెడుతున్న నూర్జహాన్ దంపతులు

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులోని శ్రీకృష్ణ గోశాలలోని గోవులకు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి షేక్ నూర్జహాన్ దంపతులు గురువారం నవధాన్యాలు, బెల్లం అందజేశారు. గోవులకు స్వయంగా ఆహార పదార్థాలు తినిపించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ దంపతులను గోశాల నిర్వాహకులు అభినందించారు.

సమస్యలపై దృష్టి సారించాలి

- మండల ప్రత్యేకాధికారి సువార్తమ్మ



కాట్రగుంటలో ఇంకుడు గుంతలు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

కొనకనమిట్ల: గ్రామాల్లో ప్రజా సమస్యలపై సచివాలయ ఉద్యోగులు దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి సీహెచ్ సువార్తమ్మ సూచించారు. ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించి, రోడ్లపై మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గురువారం కాట్రగుంట గ్రామంలో ఇంకుడు గుంతలను పరిశీలించి, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి పెండింగ్ రికార్డులు, సర్వేల పురోగతిపై చర్చించి, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీదేవి, కార్యదర్శులు ఉన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



సన్మానం అందుకున్న ఉద్యోగులతో నాయకులు

మార్కాపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంస పత్రాలు అందుకున్న వారిని బుధవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ అధ్యక్ష్య కార్యదర్శులు ఏలియా, జీవరత్నం మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించి అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఐక్యంగా ఉండి సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని, హైదరాబాద్‌లో నిర్మించ తలపెట్టిన జాంబవంతుని భవన నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జ్యోతి, కాశయ్య, శ్యామ్ సుధాకర్, రాజేష్ తదితరులను సన్మానించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు పందీటి కాశీరావు, ఉద్యోగుల సంఘ నాయకులు కుమార్, సంజీవయ్య, జోసెఫ్, హనోజీరావు, లూకా, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

- గిరిజన హాస్టల్‌ను తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: గిరిజన విద్యార్థులకు సక్రమంగా మెనూ ప్రకారం భోజనం అందించాలని సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ ఆదేశించారు. మార్కాపురం పట్టణంలోని గిరిజన హాస్టల్‌ను బుధవారం సబ్‌కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు భోజనం చేసే మెస్, మెనూ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని ఆకాంక్షించారు.

వీఏఓలు సమర్థవంతంగా పనిచేయాలి

మార్కాపురం: గ్రామాల్లో వీఏఓలు సమర్థవంతంగా పని చేయాలని వెలుగు ఏపీఎం పిచ్చయ్య కోరారు. గురువారం వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశంలో మాట్లాడుతూ.. స్త్రీనిధి, ఉన్నతి పథకాల్లో బకాయిలను నూరు శాతం రికవరీ చేయించాలన్నారు. వయోజన విద్య కోఆర్డినేటర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ.. వేములకోట గ్రామ పంచాయతీలో మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ ఇస్తామని తెలిపారు. వెలుగు సీసీలు నాగయ్య, స్వామి, గోపాల్‌రెడ్డి, మనోకుమారి, అకౌంటెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏపీఎంను సమాఖ్య సభ్యులు సన్మానించారు.

ఊరూవాడా కోలాహలం

వినాయక చతుర్థి పర్వదినాన్ని భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. రెండో రోజే నిమజ్జన కోలాహలం మొదలైంది. సాంస్కృతిక కార్యక్రమాలతో మండపాలు సందడిగా మారాయి.



కంభంలో గణేశుడి ఊరేగింపులో డప్పులతో కోలాహలం



కంభం చెరువులో విగ్రహాల నిమజ్జనం



గిద్దలూరులో పూజలో మాజీ ఎమ్మెల్యే కేపీ



కంభంలో మాజీ ఎమ్మెల్యే కేపీని సన్మానిస్తున్న నాయకులు



బేస్తవారిపేట రెడ్డి నగర్‌లో గవ్వల గణపతికి భక్తుల పూజలు



మార్కాపురంలో మట్టి ప్రతిమలు పంచుతున్న డాక్టర్ కనకదుర్గ



పొదిలిలో లంబోదరుడికి పూజలు



గణేశ్ పూజకు హాజరైన సబ్‌కలెక్టర్ త్రివినాగ్



బేస్తవారిపేటలో నృత్యరూపకం ప్రదర్శన



గణేశుడి ఆకృతిలో కంభం ఆల్ఫా స్కూల్ చిన్నారులు